క్లుప్తంగా

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



విద్యార్థుల ఆరోగ్యం పరిశీలిస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు ఒక్కో విద్యార్థి ఆరోగ్యం తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని, మంచి ఆహారం, పరిశుభ్రమైన నీరు తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజూ స్నానం చేయాలని, ఉతికిన బట్టలు ధరించాలన్నారు.

సంకిలి పీఏసీఎస్ సీఈవోగా రాజు



రేగిడి: మండలంలోని సంకిలి పీఏసీఎస్ సీఈవోగా జి.రాజ్‌కుమార్‌ను నియమించారు. ఇంతకుముందు సీఈవోగా పనిచేసిన పి.సత్యంనాయుడు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇదే సొసైటీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న రాజ్‌కుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పరామర్శ



రామారావునాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

వంగర: గ్రామ మాజీ సర్పంచ్ బొత్స రామారావునాయుడు ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం కలిసి పరామర్శించారు. అంతకుముందు రామారావునాయుడు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ కిమిడి సన్యాసినాయుడు, సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, కనగల పారినాయుడు, బొక్కేల వెంకట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన



సంతకవిటి: బ్రహ్మాస్త్రం తయారీని వివరిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని నారాయణరాజ సురం గ్రామంలో బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తొలుత బ్రహ్మాస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, చూపారు. అనంతరం దాని ప్రయోజనాలను వివరించారు.

రేగిడి: రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దేవుదళ గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం దశకంత కషాయం తయారీ, వినియోగం, ప్రయోజనాలను తెలిపారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

బొబ్బిలి: నిత్యావసరాల ధరలు తగ్గించాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు కూరగాయల దుకాణాలు, కిరాణా షాపుల వద్ద నిత్యవసర సరుకుల ధరలను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లీటరు వంటనూనె రూ.160లకు పైగా ఉందని, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అవేమీ పట్టించుకోకుండా క్వార్టర్ మద్యం ధరను రూ.99 చేయడం ఎంతమాత్రం సమంజసమని ప్రశ్నించారు. సామాన్యుడు మంచిగా జీవించడానికి నిత్యవసర సరుకులు కావాలి గానీ మద్యం కాదు అని అన్నారు. మద్యం ధరలు తగ్గించడమంటే, ఒక విధంగా తాగుడును ప్రోత్సహించడమేనని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ధరల నియంత్రణపై చర్యలు చేపట్టాలని కోరారు.

మహాన్నదానం

బాడంగి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్థానిక అయప్ప, భవానీ భక్తుల దీక్షలు విజయదశమితో ముగియడంతో వారంతా కలిసి ఈ అన్నదానం చేశారు. బాడంగితో పాటు ముగడ, ముగడ కాలనీ, పిన్నవలస, పూడివలస తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది వచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..!

- చేతుల శుభ్రతతో రోగాలు దూరం
- భోజనానికి ముందు, తర్వాత పరిశుభ్రం చేసుకోవాలి
- నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం



రాజాం సిటీ: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. ఇది అక్షరాల సత్యమంటున్నారు వైద్య నిపుణులు. మనం తాకే వస్తువుల్లో అనేక రకాల సూక్ష్మ క్రిములు ఉంటాయని, చేతులు శుభ్రంగా ఉంచుకోకుంటే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. చేతుల శుభ్రత ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ అక్టోబర్ 15ను వరల్డ్ హ్యాండ్‌వాష్ డేగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో 2008 నుంచి ప్రతిఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తూ చేతుల శుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతోంది. రక్తహీనతకు కారణమయ్యే కొంకిపురుగులు, నులిపురుగులు దరిచేరకుండా చిన్నప్పటి నుంచే చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం.

వ్యాధులు సోకే ప్రమాదం..

రోజూ చేతులు మారే కరెన్సీతో పాటు ప్రతిచోటా చేతులు పెట్టడం ద్వారా మనకు వ్యాధికారక క్రిముల రూపంలో వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. అలాగే వివిధ రోగాలున్న వారి నుంచి రోగకారక క్రిములు మన చేతికి వస్తున్నందున అవి మన శరీరంలోకి వెళ్లే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంటి తలుపులు, ఫ్రిజ్ డోర్లు, కుళాయిలు తిప్పడం, ద్విచక్ర వాహనాల హ్యాండిల్ వినియోగంలోనూ అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించని పక్షంలో తెలియకుండానే రోగాలపాలయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

డబ్ల్యూహెచ్‌వో అధ్యయనం ప్రకారం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) అధ్యయనం ప్రకారం సబ్బుతో చేతులు శుభ్రపర్చుకోకుంటే టైఫాయిడ్, పచ్చకామెర్లు, కళ్లకలకలు, దగ్గు, జలుబు, న్యూమోనియా, మెదడువాపు, చర్మవ్యాధులు వంటివి సోకుతాయి. పాఠశాలల్లో విద్యార్థుల చేతుల శుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలి. వారు వినియోగించే సాక్సులు రోజూ ఉతకడం, నీటిసీసాలు కడగడం వంటివి చేయకపోతే ఫంగస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. పిల్లల నోట్లో వేళ్లు పెట్టుకోకుండా చూడాలి. ఆటలు ఆడి వచ్చిన తర్వాత శుభ్రంగా చేతులు కడుక్కునేలా చర్యలు తీసుకోవాలి.

ముందస్తు జాగ్రత్తలు అవసరం..



రోగాల బారినపడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించడం చాలా అవసరం. చేతుల శుభ్రతతో రోగాల బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఎక్కువగా చిన్నారుల్లో జలుబు, దగ్గు, జ్వరం, నీరసం వంటి తదితర వ్యాధులు చేతులు అపరిశుభ్రంగా ఉండడంతోనే సంక్రమిస్తుంటాయి.

– డాక్టర్ కె.హరిబాబు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- ఆహారం తీసుకునే ప్రతీసారి రెండు చేతులను కనీసం రెండుసార్లు సాధారణ సబ్బుతో కడుక్కోవాలి.
- సబ్బు అందుబాటులో లేనిచోట కనీసం నీటితో బాగా కడగాలి. -కుళాయి ఉంటే ఫోర్స్‌గా తిప్పి చేతులు కడగాలి.
- కాళ్లు కడగడం కూడా తప్పనిసరి.
- ఆహారం తీసుకున్న తర్వాత చేతులు కడిగాక, ఉతికిన పరిశుభ్రమైన వస్త్రంతో చేతిని తుడుచుకోవాలి.
- గోళ్లలో మట్టి చేరకుండా జాగ్రత్తపడాలి, గోళ్లు ఎక్కువైతే కట్ చేసుకోవాలి.
- వారానికి రెండుసార్లు అయినా తలస్నానం చేయాలి
- మలవిసర్జన తర్వాత తప్పనిసరిగా రెండు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- తినే ఆహార పదార్థాలను ముట్టుకునే ముందు, తినే ముందు, పిల్లలకు ఆహారం తినిపించే ముందు ఆహారం తినిపిస్తున్న సమయంలో చేతులు ఇతర పనులకు వినియోగించరాదు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



తెర్లాం: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలో పల్లె పండగ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన ఈ కార్యక్రమంలో పాల్గొని, పలు అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరణ, భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువలు, డబ్ల్యూఎంబీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. తెర్లాం మండలంలో 120 పనులకుగాను రూ.7.20 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఎస్సీ వీధుల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆ వీధివాసులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రేగి రాంబాబు, ఉప తహసీల్దారు గొంగాడ సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ నీలిమ, ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని శ్యాంపురం గ్రామంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. త్వరితగతిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఏపీడీ ఎం.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్మోహనరావు, ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని తలతంపర గ్రామంలో పల్లె పండగ కార్యక్రమం సోమవారం నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు.

బొబ్బిలిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో పి.రవికుమార్ సోమవారం సమావేశమై, మండలంలోని గ్రామాల్లో నిర్వహించాల్సిన పల్లె పండగ కార్యక్రమంపై చర్చించారు. సమావేశంలో ఈవోఆర్‌డీ భాస్కరరావు, ఏపీవో లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సమావేశమై, ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న పల్లె పండగ కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు.

తోటపల్లి నీరందించడంలో అధికారులు విఫలం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: తోటపల్లి పాత కుడిప్రధాన కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించడంలో అధికారులు విఫలమయ్యారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విమర్శించారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. గత 15 రోజులుగా సాగునీరు అందకపోవడంతో చాలాచోట్ల వరిపంట ఎండిపోయిందన్నారు. తోటపల్లి కాలువ శివారు గ్రామాలైన బంగారువలస, రుషింగి, కొప్పరవలస, కె.కొత్తవలస, తలగాం, మద్దివలస, సీతారాంపురం, వంగర గ్రామాల్లోని 4 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, ప్రస్తుతం ఆయా చోట్ల పొలాలకు సాగునీరందక పంటలు పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంట చేతికందే సమయంలో సాగునీటి కొరత కారణంగా పంట నాశనమవుతుండడం విచారకరమన్నారు. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. సాగునీటి కోసం రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టం జరిగితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు గేదెల రామకృష్ణ, పాలవలస దవలేశ్వరరావు, కనగల పారినాయుడు, బొక్కేల వెంకట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టాంపులు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న భారత న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు

బొబ్బిలి: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కోర్టు ఫీజు స్టాంపులను అందుబాటులో ఉంచాలని భారత న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు కండాపు ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలలుగా కోర్టు ఫీజు స్టాంపులు లేవని, దీనిపై సబ్‌రిజిస్ట్రార్‌ను పలుమార్లు సంప్రదించినా ఫలితం లేదని వాపోయారు. కోర్టు ఫీజు స్టాంపుల కొరత కారణంగా కొన్ని ముఖ్యమైన లావాదేవీలు వాయిదా పడుతున్నాయన్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గడమే కాకుండా కక్షిదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, స్టాంపులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రెగ్యులర్ చేయాలని డిమాండ్



పసుపు రిబ్బన్లు ధరించి, నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

బాడంగి: తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు సోమవారం నిరసన చేపట్టారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వారు అదే కళాశాలలో భోజన విరామ సమయంలో చొక్కాలకు పసుపు రిబ్బన్‌లు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. వారి తరఫున ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు రెగ్యులరైజేషన్ యాక్ట్ 30, జీవో ఎంఎస్ నంబరు 114 తెచ్చిందని అయితే ఎన్నికల కోడ్ కారణంగా వాటి అమలు నిలిచిపోయిందని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేసి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3,618 కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరారు.

కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వరరావు

బొబ్బిలిరూరల్: నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లో రూ.8.42 కోట్ల వ్యయంతో కాలువల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బాడంగి మండలంలో 25 కాలువల పనులకు రూ.2 కోట్లు, బొబ్బిలిలో 39 కాలువల పనులకు రూ.2.49 కోట్లు, తెర్లాంలో 29 కాలువలకు రూ.1.61 కోట్లు, రామభద్రపురం మండలంలో 45 కాలువల పనులకు రూ.2.32 కోట్లు అవసరమవుతున్నట్లు తెలిపామన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు సంబంధించి, ఇంకా నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పథకం పనుల నిధుల మంజూరును కూడా ప్రభుత్వాన్ని కోరామన్నారు.

సన్మానం



దాలినాయుడును సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు, తదితరులు

రామభద్రపురం: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కవితా సమ్మేళనంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కిలపర్తి దాలినాయుడును సత్కరించారు. 'అద్దం నా ఎడిటర్' అన్న వీరి వచన కవిత.. సాటి కవి మిత్రులు, ఉత్సవ నిర్వాహకులను ఆకట్టుకుంది. దీంతో పాటు విజయనగరంలో శ్రీపైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో ఆయన పాల్గొన్నందున ఆయనను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో అన్నపూర్ణ ఆపన్నహస్తం అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన బి.జ్యోత్స్నను డిప్యూటీ ఈవో మోహనరావు సత్కరించారు. గతేడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినందున ప్రోత్సహిస్తూ ఈ సన్మానం చేశారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని అంబాడ వెంకటాపురం, పెద్దశిర్లాం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం సందర్శించిన ఆయన.. తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని దేవుదళ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సోమవారం సందర్శించి, పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, మంచి ఉత్తీర్ణత శాతానికి కృషి చేయాలని ప్రిన్సిపాల్ లక్ష్మికి సూచించారు.

గ్రామసభ

రాజాం: మండలంలోని దోసరిరామినాయుడువలస గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వేతనదారులంతా కలిసి ఉపాధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే చేయాలి

రేగిడి: ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు సూచించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో ఆస్పత్రిలో సోమవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఫీవర్ సర్వే ద్వారా జ్వరపీడితులను గుర్తించి, వారికి వెంటనే వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. గ్రామీణులకు ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుందరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయండి



మాట్లాడుతున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

రాజాం: పట్టణంతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యజమానులు తమ విద్యార్థుల వివరాలను అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్)లో త్వరితగతిన నమోదు చేయాలని ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన..పాఠశాలల వారీగా అపార్ నమోదు ప్రక్రియపై ఆరాతీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాజాంలో మొత్తం 3,444 మంది విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు చేయాల్సి ఉండగా, ఇంతవరకు 60 శాతం మేర నమోదు జరిగిందని పేర్కొన్నారు. మొత్తం 58 పాఠశాలల 9, 10వ తరగతుల విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్నామన్నారు.

మద్యం దుకాణాలు కేటాయించండి

బొబ్బిలి: కల్లుగీత కార్మికుల మాదిరిగానే సొండి కులస్తులకు కూడా మద్యం దుకాణాలు కేటాయించాలని సొండి కుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కేవీ చౌదరి ఓ ప్రకటనలో సోమవారం డిమాండ్ చేశారు. మద్యం షాపుల కోసం నిర్వహించిన దరఖాస్తు ప్రక్రియ పూర్తి కాగా, లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు జరుగుతున్న వేళ సొండి కులస్తులకు కూడా షాపులు కేటాయించి, వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కోరారు.

వెంకన్నబందకు సాగునీరందించాలి



వినతిపత్రం అందజేస్తున్న అల్లువానివలస రైతులు

బాడంగి: మండలంలోని గూడెపువలస పంచాయతీ పరిధిలోని అల్లువానివలసకు చెందిన వెంకన్నబంద(చెరువు)కు సాగునీరందించాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణను సోమవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. వేగావతి నదిలోని నీరు పాల్తేరు చానల్ ద్వారా అప్పలనాయుడు చెరువుకు చేరుతుందని, ఆ చెరువు నిండిన తర్వాత మిగులునీటిని తమ వెంకన్నబందకు తరలించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి, చూస్తామని ఎంపీడీవో తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘనంగా నివాళులు



సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొబ్బిలి: ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం పట్టణ కార్యదర్శి పొట్నూరు శంకరరావు కొనియాడారు. స్థానిక కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ సోమవారం నిర్వహించి, సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ప్రజలకు మంచి చేయాలనే తపన పడిన వ్యక్తి ఆయన అని, ప్రజల కోసం పోరాడినందుకు గాను ఆయనపై నక్సలైట్ ముద్రవేసి జైలు పాలుచేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించి, ప్రజలకు మంచి జరిగేలా ప్రయత్నించాలన్నారు. సమావేశంలో రిటైర్డ్ రైల్వే పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రంపా రాఘవరావు, సీపీఐ పట్టణ అధ్యక్షుడు మునకాల శ్రీనివాసరావు, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాయితి సత్యం, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మణ్‌నాయుడు, రైతు సంఘం నాయకులు ఎం.గోపాలం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిందే..



మాట్లాడుతున్న ఎంపీడీవో రత్నం

రామభద్రపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిందేనని ఎంపీడీవో రత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశమైన ఆమె.. సంక్షేమ పథకాల కోసం వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేయడంతో పాటు పథకాల మంజూరు చేయడంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లదే ప్రధాన పాత్ర అన్నారు. అలాగే సచివాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా సేవలందించాలని సూచించారు. ప్రతీ ఉద్యోగి సమయపాలన పాటించాలని, ఈ నెల 17వ తేదీన జరగనున్న పల్లె పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



పెరుమాళి-1 అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో ముచ్చటిస్తున్న పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని పెరుమాళి-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి, పిల్లల హాజరు, పౌష్టికాహారం, రికార్డులను తనిఖీ చేశారు. చిన్నారుల బరువు, ఎత్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో సరుకుల నిల్వలు, వాటికి సంబంధించిన రికార్డులను చూసి, పలు సూచనలు చేశారు. కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య, పౌష్టికాహారం అందివ్వాలని తెలిపారు.